క్లుప్తంగా

ఘనంగా స్వామివారి ఊరేగింపు



స్వామి వారి ఊరేగింపులో భక్తులు

ఏన్కూరు: మండల పరిధిలోని గార్లఒడ్డు శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్యారాధన, యాగశాల, శ్రీమహలక్ష్మీ, ఇష్టపూర్ణహుతి కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని గుర్రపు బండిపై ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, డాక్టర్ మట్టా సాత్విక్, మట్టా చెన్నారావు, పింగళి సామేలు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

ఏన్కూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం నుండి ఏన్కూరు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఎనిమిది మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, కామేపల్లి, తల్లాడ, వైరా, జూలూరుపాడు, చంద్రుగొండ మండలాలు క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ, తృతీయ, చతుర్థి బహుమతులు రూ.17 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంట్రీలు బుధవారం ఇవ్వాలని, మిగత వివరాలకు 9252413519, 9063991501 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రహదారి సౌకర్యం కల్పించాలి

ముదిగొండ: మండలపరిధిలోని ముత్తారం డబుల్ బెడ్‌రూం ఇళ్లకు రహదారి సౌకర్యం కల్పించాలని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వాసులు తహసీల్దార్ సునితకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కొందరు రహదారిని ఆక్రమించి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. స్పందించిన తహసీల్దార్ రహదారిని పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.


గిరిమాత ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవాలు ప్రారంభిస్తున్న గురువులు శౌరి

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో లూర్దు గిరిమాత తిరునాళ్ల ఉత్సవాలను విచారణ గురువులు టి. శౌరి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్సవాల పతాకం ఆవిష్కరించి దివ్య బలిపూజ, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పహల్గాం ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. సైనికుల కుటుంబాలకు మేలు జరగాలని ప్రార్థనలు చేశారు. అనంతరం మాత విగ్రహాన్ని ఊరేగించారు.

అమరుల స్ఫూర్తితో ముందుకుసాగాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై, నాయకులు

బోనకల్: సరిహద్దు వద్ద పాకిస్తాన్ బలగాలు జరిపిన కాల్పుల్లో మృతి చెందిన మురళీనాయక్ ఇతర జవాన్లకు నివాళులర్పిస్తూ మంగళవారం మండల కేంద్రంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై పొదిలి వెంకన్న మాట్లాడుతూ.. మురళీనాయక్ సాహసం మరువలేనిదన్నారు. వారి త్యాగాన్ని నేటి యువతకు స్ఫూర్తిగా తీసుకుని దేశభక్తితో ముందుకుసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మోదుగు సుధాకర్, ప్రదీప్, డేవిడ్, ప్రభాకర్, జ్వాలా, బాబా, మౌలాలి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫికర్ పడాల్సిందే..

కొణిజర్ల మండలకేంద్రంలో వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య

- ఒక్క నిమిషం ఏదైనా వాహనం ఆగితే అంతే..
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, స్థానికులు
- పలుమార్లు వినతులు చేసిన ఫలితం లేదు
- డివైడర్లు ఏర్పాటు చేయాలని వేడుకోలు



కొణిజర్లలో ట్రాఫిక్‌లో నిలిచిపోయిన వాహనాలు

కొణిజర్ల: మండల కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో స్థానికులతో పాటు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో దాదాపు అన్ని మండల కేంద్రాలలో డివైడర్‌లు ఉన్నప్పటికీ కొణిజర్లలో డివైడర్‌లు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్నిసార్లు భారీ ప్రమాదాలు జరుగుతున్నా ఎక్కువ పర్యాయాలు తేలికపాటి ప్రమాదాలే జరుగుతుండటంతో ప్రాణాపాయం లేకుండాపోతుంది. దీంతో స్థానికులు డివైడర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

హైవేలకు ఇదే బాట..

ఖమ్మం రాజమండ్రి జాతీయ రహదారి, ఖమ్మం భద్రాచలం మీదుగా ఛత్తీస్‌ఘడ్ జాతీయ రహదారికి వెళ్లాలన్నా కొణిజర్ల మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో ఖమ్మం టు దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణ పనులు జరుగుతుండటంతో పాటు ఏపీకి దగ్గరి దారి కావడంతో వాహనాలన్నీ ఖమ్మం సత్తుపల్లి రోడ్డులోనే తిరుగుతున్నాయి. ఒక్క నిమిషం పాటు ఏదైనా వాహనం ఆగిపోతే పదుల సంఖ్యలో వాహనాలు వెనక నిలిచి ఉండి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీనికి తోడు కొణిజర్ల మండలం తనికెళ్ల బ్రౌన్స్ కళాశాల నుంచి వైరా శాంతినగర్ వరకు నిత్యం ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లు ఎక్కువగా ఉండటం వల్ల రోజులో ఏదో ఒక సమయంలో ప్రమాదం జరుగుతూనే ఉంది. ప్రమాదాలు జరిగినప్పుడు వాహనాలు రోడ్డుపై నిలిచిపోతే వందల సంఖ్యలో ఇతర వాహనాలు నిలిచి పోయి గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది.

ఇటీవల కొన్ని ఘటనలు

- ఓ రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రమాద వశాత్తు రోడ్డు పై బోల్తా పడటంతో దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచి పోయింది.
- కొణిజర్ల పోలీస్ స్టేషన్ సమీపంలో ఓ లారీలో తరలిస్తున్న ఐరన్ షీట్లు రోడ్డుకు అడ్డంగా పడిపోతే దాదాపు గంటన్నర సేపు వాహనాలు నిలిచి పోయాయి.
- కొణిజర్ల ఎన్ఎస్‌పీ కాల్వ సమీపంలో ధానిమ్మకాయల లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు రోడ్డుకు అడ్డంగా పల్టీ కొట్టడంతో దాదాపు ఐదు గంటలకు పైగా ట్రాఫిక్ నిలిచి పోయింది.
- ఇలా పలు సందర్భాల్లో ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో పోలీసులు ఏదైనా క్రేన్, జేసీబీ వంటి వాహనాలను తరలించి ప్రమాదాలకు గురైన వాహనాలను పక్కకు తీయాలంటే ట్రాఫిక్‌లో ముందుకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

రోడ్డు దాటాలంటే భయం



నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు రోడ్డు మీద తిరుగుతున్నాయి. రోడ్డు దాటాలంటే ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని దాటిల్సి వస్తుంది. కనీసం పది నిమిషాలు రోడ్డు పక్కన వేచి ఉండి రోడ్డు దాటిల్సిన పరిస్థితి. నిమిషం కూడా ఆగకుండా అర్ధ రాత్రి వరకు వాహనాలు వస్తూనే ఉంటాయి. రోడ్డు దాటాలంటే భయం వేస్తుంది.

– చల్లగుండ్ల కృష్ణయ్య, కొణిజర్ల

డివైడర్లు ఏర్పాటు చేయాలి.....



కొణిజర్ల మండల కేంద్రంలో మండపరిషత్ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు సుమారు కిలోమీటర్ మేర డివైడర్‌లు ఏర్పాటు చేయాలి. దీని వల్ల ట్రాఫిక్ సమస్య, రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే డివైడర్‌లు ఏర్పాటు చేయించాలి.

– చల్లా సత్యం, కొణిజర్ల

సీబీఎస్ఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

న్యూ లిటిల్ ఫ్లవర్స్ వందశాతం ఉత్తీర్ణత



వైరా: ప్రతిభ చూపిన విద్యార్థులతో యాజమాన్యం

వైరా: సీబీఎస్ఈ పది, 12వ తరగతుల ఫలితాలు మంగళవారం విడుదల చేయగా, వైరాలోని న్యూలిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10వ తరగతి పరీక్షలకు 172 మంది బాలబాలికలు హాజరు కాగా 100 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. వీరిలో బండి రమ్యశ్రీ, ఏలూరి త్రియ 97 శాతం, గూడూరి ఊహిత, అంచూరి అంజలి 96, డి.సాత్విక చౌదరి 95, మేడా చర్విత, మణికంఠ, మేఘన 94 శాతం మార్కులు సాధించినట్లు తెలిపారు. అలాగే, 12వ తరగతి ఫలితాల్లో 48 మందికి గాను 100 శాతం ఉత్తీర్ణత నమోదైందని, బోజెడ్ల తేజశ్రీ 90శాతం మార్కులతో టాపర్‌గా నిలిచిందని వెల్లడించారు. విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు చైర్మన్ ఐఈ.రమణారావు, డైరెక్టర్లు డాక్టర్ కాపా మురళీకృష్ణ, కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూ, ఏట నర్సింహారావు అభినందించారు.

డీఏవీ విద్యార్థులు..



ప్రతిభ చూపిన శ్రీస్ఫూర్తిరెడ్డి

సత్తుపల్లిరూరల్: సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో గంగారం సాయిస్ఫూర్తి డీఏవీ విద్యార్థులు నూరుశాతం ఫలితాలతో ప్రతిభ చూపారని పాఠశాల ప్రిన్సిపాల్ శేషసాయిశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను ఆమె అభినందించారు. పాఠశాల రీజనల్ ఆఫీసర్ జీఆర్ ప్రసాద్, సాయిస్ఫూర్తి కళాశాల చైర్మన్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ట్రస్టీ బండి అన్విద అభినందనలు తెలిపారు.

తేజ కార్తికేయకు జాతీయ స్థాయి ర్యాంక్

మధిర: సీబీఎస్ఈ 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో మధిర సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ విద్యార్థి మల్లవరపు తేజ కార్తికేయ 495 మార్కులతో ఆలిండియా రెండో స్థానం, జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ అన్‌బేబి, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

బడిబాట



బడిబాటలో ఉపాధ్యాయులు

ఏన్కూరు: మండల పరిధిలోని అంబేద్కర్ నగర్ కాలనీలో స్థానిక జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కూరకుల సైదయ్య, ఉపాధ్యాయులు నాగేశ్వరావు, పుల్లయ్య, రాఘవారావు పాల్గొన్నారు.

పరామర్శ

తల్లాడ: మండలంలోని గొల్లగూడెంలో కాంగ్రెస్ నాయకులు కాపా అప్పయ్యను మంగళవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల నాయకులు భట్టికి స్వాగతం పలికగా జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆయన్ను కలిశారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాపా సుధాకర్, వేమిశెట్టి నాగన్న, కేతేపల్లి భాస్కర్‌రావు, గుండ్ల వెంకటేశ్వర్లు, కాపా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు భట్టి పర్యటన

ఎర్రుపాలెం: మండలంలో నేడు (బుధవారం) డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటించనున్నారని ఆయన పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కార్మిక వర్గాన్ని విస్మరిస్తే పతనం తప్పదు

- సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి: కార్మిక సంఘం నాయకులు



సత్తుపల్లిరూరల్: అభివాదం చేస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్: కార్మికవర్గాన్ని విస్మరిస్తే ప్రభుత్వ పతనం తప్పదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి చలమాల విఠల్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ, సింగు నర్సింహారావు అన్నారు. సత్తుపల్లిలో మంగళవారం జరిగిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు మోరంపూడి పాండు, సర్వేశ్వరరావు, వెంకన్న, రామారావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, యాకోబు, మస్తాన్, రాము, నర్సింహారావు, కుమారి, సంధ్య, వెంకటరెడ్డి ఉన్నారు.

చింతకాని: కార్మిక, కర్షక, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 20న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ మతం పేరుతో దేశ సమగ్రతను దెబ్బతీస్తూ అబద్ధపు ప్రచారం చేస్తుందన్నారు. గ్రామాల, ప్రజా సంఘాల శాఖా సమావేశాలు పూర్తి చేసి త్వరలో మండల మహాసభ నిర్వహించాలన్నారు. పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జునరావు, నాయకులు కూచిపూడి రవి, రాసాల మోహన్‌రావు, గోపాలరావు, అబ్బూరి మహేష్, శ్రీను, అమర్లపూడి వెంకన్న, బొడ్డు కొండలరావు, తూములూరి రంగయ్య, ఏపూరి నర్సయ్య, చాట్ల బాబు, కొత్తపల్లి రమేష్ పాల్గొన్నారు.

తల్లాడ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలనీ టీయుసీఐ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వెంకన్న, జి.రామయ్య పిలుపునిచ్చారు. టీయూసీఐ తల్లాడ, ఏన్కూరు ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆదానీ, అంబానీలకు ప్రభుత్వ పరిశ్రమలను అప్పనంగా కట్టబెడుతుందన్నారు. పఠాన్, నాగుల్‌మీరా, శ్రీనివాసరావు, లాల్ మియా, నాగయ్య, కిషోర్, శ్రీను, బడేమియా, పుల్లారావు, రాఘవ, రమణ, వెంకటేశ్వర్లు, సత్యం పాల్గొన్నారు.



చింతకాని: మాట్లాడుతున్న జితేందర్‌రెడ్డి



తల్లాడ: మాట్లాడుతున్న రామయ్య

పార్టీని బలోపేతం చేయండి

- ఎమ్మెల్యే రాగమయి



సత్తుపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: క్షేత్ర స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులతో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు బత్తిన శ్రీనివాసరావుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కష్ట కాలం నుంచి ఇప్పటి వరకు పార్టీ కోసం పని చేసిన వారికి సముచిత స్థానం లభిస్తుందన్నారు. బూత్ స్థాయి నుంచి వార్డులు, గ్రామాల వారీగా సంస్థాగత అధ్యక్షులను నియమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ఏఎంసీ చైర్మన్లు దోమ ఆనంద్‌బాబు, భాగం నీరజ, చంద్రశేఖర్‌రెడ్డి, గాదె చెన్నారావు, కె.వెంకటేశ్వరరావు, సుధాకర్, రఘుపతిరెడ్డి, తోట సులరాణి, దొడ్డా శ్రీనివాసరావు, చల్లగుళ్ల నర్సింహారావు, పింగళి సామేలు తదితరులు పాల్గొన్నారు.

వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



వైరా: మాట్లాడుతున్న శ్రీనివాసరావు

వైరా: ప్రతీ మండలంలోని బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి అధ్యక్షులను నియమించాలని కాంగ్రెస్ వైరా నియోజకవర్గ పరిశీలకుడు బత్తిని శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల, పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్ స్థాయి నుంచి పార్టీ కమిటీల సంస్థాగత నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వేములు కృష్ణ ప్రసాద్, అనుమోలు కృష్ణార్జునరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, స్వర్ణ నరేందర్, తలారి చంద్ర ప్రకాశ్, మంగీలాల్ నాయక్, పాలేటి నరసింహారావు పాల్గొన్నారు.

సాగు వ్యయం తగ్గించుకోవాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త భరత్

మధిర: రైతులు ప్రధాన పంటల సాగుకు ముందు పచ్చి రొట్ట పంటలు వేస్తే యూరియా వాడకం తగ్గుతుందని మధిర వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భరత్ తెలిపారు. మండలంలోని మాటూరు రైతువేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' పేరిట మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులను అవసరం మేర మాత్రమే వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని పరిరక్షించవచ్చాన్నారు. అలాగే, విత్తనాల ఎంపిక, కొనుగోలులో జాగ్రత్తలు, వాణిజ్య పంటల సాగు, సబ్సిడీలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి విష్ణు, ఏఓ సాయిదీక్షిత్, ఏఈఓలు వేణు, గురుమూర్తి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, రైతులు పాల్గొన్నారు.

'భూ భారతి'తో భూ సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ చందర్

బోనకల్: భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ పున్నం చందర్, రాంబాబులు అన్నారు. మండలంలోని రావినూతల, రాపల్లి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెవెన్యూ సదస్సులో రైతుల నుండి వచ్చిన దరఖాస్తులను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతీ రైతుకు అర్థమయ్యే రీతిలో ఈ చట్టం ఉందని, హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు భూభారతిలో అవకాశం ఉంటుందన్నారు. రావినూతలలో జరిగిన రెవెన్యూ సదస్సులో భూసమస్యలకు సంబంధించి 122, రాపల్లిలో 144 దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు నవీన్, మైథిలీ, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుంటే నిలదీయాలి



మాట్లాడుతున్న రవిబాబు

మధిర: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు అన్నారు. ఈ మేరకు మధిరలోని రెడ్డిగార్డెన్స్‌లో పార్టీ మండల కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాల్లో రాజకీయాలకు తావులేకుండా అర్హులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంఏ.రహీం, ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, నాయకులు తలారి రమేష్, ఊట్ల రామకృష్ణ, బ్రహ్మం, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి సబ్‌స్టేషన్ వెంగన్నపేట ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా ఐదు గ్రామాలకు బుధవారం ఉదయం 7:30 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కుర్నవల్లి ఏఈ దారా కృష్ణకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నూతనకల్, గూడూరు, ముద్దుగూడూరు, రామచంద్రాపురం, వెంకట్రామునితండా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

ఆలయాల్లో అన్నదానం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేట భక్తాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన బొంతు సూర్యనాయణ, భారతి దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయానికి రూ.18వేలు విరాళంగా అందించారు. కమిటీ నిర్వాహకులు చల్లగుండ్ల కృష్ణయ్య, నాగళ్ల ప్రసాద్, రజిని, రాజ్యం, ప్రవీణ్, సునీత, శైలజ ఉన్నారు. అదేవిధంగా వేంసూరురోడ్ మెట్టాంజనేయస్వామి ఆలయంలో వందపు కృష్ణసుధీర్, వాసవీ అన్నపూర్ణ, కొత్తూరు సత్యనారాయణ, శారద దంపతులు అన్నదానం నిర్వహించారు.

పశువుల షెడ్లకు ప్రభుత్వ సాయం

- ఉపాధి హామీ నిధులతో తోడ్పాటు
- జాబ్ కార్డులున్న వారికి అవకాశం



వేంసూరులో పూర్తయిన పశువుల షెడ్

వేంసూరు: పాడి పశువులు, గొర్రెలు, మేకలు పెంపకందారులకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తుంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు, జీవాల పెంపకం దారులు పశువుల షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అదేవిధంగా పశువులు, జీవాల పోషణకు పచ్చగడ్డి పెంపకం, నీటి తొట్ల నిర్మాణానికి ఆర్థిక చేయూత అందించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న వారిని అర్హులుగా గుర్తించారు.


యూనిట్ విలువ ఇలా..

పశువుల షెడ్ల నిర్మాణానికి రూ.85 వేలు చొప్పున మంజూరు చేస్తున్నారు. మేకలు, గొర్రెలు, పశువుల సంఖ్య ఆధారంగా నిధులు కేటాయించనున్నారు. వేసవిలో జీవాల దాహం తీర్చేందుకు గాను నీటి తొట్ల నిర్మాణానికి నిధులు కేటాయించనున్నారు. జీవాల సంఖ్య ఆధారంగా నీటి తొట్ల నిర్మాణానికి రూ.15 నుంచి రూ.20 వేల వరకు మంజూరు చేశాలా ప్రణాళిక రూపొందించారు.

దరఖాస్తు విధానం..

షెడ్ల నిర్మాణానికి ముందుగా పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణతో పాటు జాబ్ కార్డు, సంబంధిత పశుసంవర్ధక శాఖ అధికారి నుంచి జీవాలు, పశువులు ఉన్నట్టు ధ్రువీకరణ తీసుకోవాలి. పెంపకందారుడికి భూమి ఉన్నట్లు తహసీల్దార్ నుంచి ధ్రువీకరణ తీసుకుని మండల పరిషత్ కార్యాలయం అధికారికి దరఖాస్తు అందించాలి. పరిశీలన అనంతరం ఉపాధి హామీ నుంచి జీవాల సంఖ్య ఆధారంగా నిధులు మంజూరు చేస్తారు. 2024–2025 ఆర్థిక సంవత్సరంలో 30 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటి వరకు 11 షెడ్లు నిర్మాణం పూర్తయ్యాయి. ఇదిలా ఉండగా షెడ్ల కోసం ఉన్న అవకాశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి. అర్హులైన వారు నిర్మాణం చేసుకునేలా ప్రోత్సాహం అందించి బిల్లులు త్వరగా అందేవిధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పశువులు, గొర్రెలు, మేకల షెడ్ల మంజూరులో గొల్ల కురుమలతో పాటు ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. అర్హులందరు సద్వినియోగం చేసుకోవాలి.

– విజయ్, ఏపీఓ, వేంసూరు